క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కడియం: మాధవరాయుడుపాలెంలోని భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. అన్నందేవుల మణీందర్, ప్రేమ దంపతుల కలశ స్థాపనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బాలా త్రిపురసుందరీ పీఠం నిర్వాహకుడు గరిమెళ్ల వెంకట రమణశాస్త్రి ఆధ్వర్యంలో పదహారుమంది వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజు ప్రత్యేక పూజలు జరిపారు. ఈనెల 27వ తేదీ ఉదయం 9.45 గంటలకు భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామివారితో పాటు 18 విగ్రహాలను ఏకకాలంలో ప్రతిష్ఠించనున్నారు.

అవగాహనతోనే క్షయ నిర్మూలన

కడియం: అవగాహన పెంచుకోవడం ద్వారా క్షయవ్యాధిని నిర్మూలించగలమని కడియం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి శ్రీహర్ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మోహన వంశీ, అరుణ, శిరీష, సూపర్‌వైజర్ జి.శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత డీఈఓ ఉయ్యూరమ్మ మృతి



రాజమహేంద్రవరం సిటీ: విశ్రాంత డీవైఈఓ, ట్రైనింగ్ కాలేజీ ప్రధానోపాధ్యాయులు పి.ఉయ్యూరమ్మ (89) బుధవారం మృతి చెందారు. విధి నిర్వహణలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పేరుపొందిన ఆమె 1991లో ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం గాంధీపురం-2లో నివాసం ఉంటున్నారు. కొద్దికాలంగా అస్వస్థతతో ఉన్న ఆమె బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు ముగ్గురు కుమారులు. ఉయ్యూరమ్మ అంత్యక్రియలు శుక్రవారం పేపరుమిల్లు సమీపంలోని క్రైస్తవ శ్మశాన వాటికలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డాక్టర్ భారతి కన్నుమూత



కంబాలచెరువు: దాదాపు 60 ఏళ్ల పాటు వైద్యసేవలందించిన డాక్టర్ వీఎస్ భారతి (92) గురువారం మధ్యాహ్నం శ్రీరామనగర్‌లోని స్వగృహంలో కన్నుమూశారు. ఆమె భర్త కామేశ్వరరావు కొద్ది నెలల క్రితం కాలం చేశారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్ వీరి అల్లుడు. భారతి విశాఖపట్నంలో ఎంబీబీఎస్ చేసి రామచంద్రపురం, నందిగామ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్యురాలిగా వైద్యసేవలందించారు. తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి ఆర్యాపురంలో ప్రైవేట్ ప్రాక్టీసు ప్రారంభించారు. శ్రీరామ నగర్‌లో స్వరూపిణి నర్సింగ్ హోమ్ స్థాపించి పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్యం చేశారు. శుక్రవారం ఉదయం కోటిలింగాల రోటరీ కైలాసభూమిలో ఆమె అంత్యక్రియలు జరుగుతాయి.

భగత్‌సింగ్ వర్ధంతి

ప్రకాశం నగర్: భగత్ సింగ్ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక రైతు పల్లి మార్కెట్ సెంటర్లోని భగత్‌సింగ్ విగ్రహానికి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. స్థానిక నందం గనిరాజు సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అంతకు ముందు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు ఎ.సతీష్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నిలిచిన కౌన్సెలింగ్

కంబాలచెరువు: వైద్య ఆరోగ్యశాఖలో నిర్వహిస్తున్న పదోన్నతుల ప్రక్రియలో భాగంగా రాజమహేంద్రవరంలోని ఆర్డీ కార్యాలయంలో గురువారం చేపట్టిన కౌన్సెలింగ్ ఇరువర్గాల వివాదంతో నిలిచిపోయింది. అయితే కౌన్సెలింగ్ నిర్వహించాలని ఒక వర్గం రాత్రి 11 గంటల వరకు ధర్నా చేసింది. జోన్ 2 పరిధిలోని తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో హెల్త్ అసిస్టెంట్లకు హెల్త్ సూపర్‌వైజర్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ పద్మశశిధర్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. అయితే వేరే వర్గం ఆ పదోన్నతులను నిలిపివేయాలని గొడవ చేసింది. మొత్తానికి ఇరువర్గాల ఆందోళనతో కౌన్సెలింగ్ ప్రక్రియను ఆగిపోయింది. ఈ విషయాన్ని డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు విషయాన్ని వివరించి, వారి ఆదేశాల మేరకు తిరిగి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆర్డీ పద్మ శశిధర్ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: ఆల్కాట్ గార్డెన్స్ సమీపంలోని రైల్వే క్వార్టర్స్‌లో పనిచేస్తున్న నందీప్‌కుమార్ (29) మామిడికాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. అక్కడ నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

వైఎస్సార్ సీపీలోనే బీసీలకు గుర్తింపు

- ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి



బీసీ సంఘ నాయకులను సత్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, చిత్రంలో నాగేశ్వరరావు

సీటీఆర్ఐ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు దక్కిందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నివిధాలుగా బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని ఆనంద్ రీజెన్సీ హోటల్లో గురువారం శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఉన్నత స్థానాలలో ఉన్న బీసీ సంఘీయులను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ భరత్‌రామ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు హాజరయ్యారు.

ఎంతో ప్రాధాన్యం

ఎంపీ భరత్ మాట్లాడుతూ ఎమ్మెల్సీలుగా శాసన మండలిలో బీసీలకు సీఎం జగన్ ప్రాధాన్యత కల్పించారని, రాజ్యసభ సభ్యుడిగా పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు అవకాశం ఇచ్చారన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గంలో తనకు అవకాశం కల్పించారన్నారు. జాతి పెద్దలు దొమ్మేటి వెంకటరెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న, బాపన్న దొర ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. బీసీల మనోభావాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి స్వయంగా వెళ్లి వివరిస్తానన్నారు.

సన్మాన గ్రహీతలు వీరే..

మార్గాని సురేష్, రాయుడు గణేష్, ఇళ్ల శివప్రసాద్, పెంకే సురేష్ కుమార్, పి.మురళీ మోహన్, వెంకటరమణ, వనుము చంద్రశేఖర్, పితాని శ్రీనివాస్, గెద్దాడ వెంకటేశ్వరరావు, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, గేడి అన్నపూర్ణరాజు, పిల్లి శ్రీనివాస్‌ను సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



తిలక్‌రోడ్డులోని సంఘ కార్యాలయంలో..



వేమగిరి బుద్ధవిహార్‌లో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ

శెట్టిబలిజ పితామహుడు

సీటీఆర్ఐ: శెట్టిబలిజ సామాజిక వర్గానికి గుర్తింపు, గౌరవం తీసుకువచ్చి, వారి ఉన్నతికి పాటుపడిన మహానుభావుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు మేడిశెట్టి తాతబ్బాయి అన్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని గురువారం తిలక్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘ జనరల్ సెక్రటరీ సానబోయిన రామారావు మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను అందరికీ తెలియ జేసేందుకు గ్రామగ్రామానా స్థూపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ధవళేశ్వరం అధ్యక్షుడు బత్తుల ఏడుకొండలు, సభ్యులు ఎం.సత్యనారాయణ, బొక్క వెంకట ప్రతాప్, కట్టా కృష్ణ, బత్తిన ప్రసాద్, కడలి కెరటాలు పాల్గొన్నారు.

బుద్ధవిహార్‌లో విగ్రహావిష్కరణ

కడియం: విశ్రాంత సీఐ యార్లగడ్డ జగదీశ్వరరావు ఆధ్వర్యంలోని వేమగిరి బుద్ధవిహార్‌లో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. మాజీ ఎంపీటీసీ వాసంశెట్టి నాగబాబు సమకూర్చిన విగ్రహాన్ని సంఘీయుల సమక్షంలో ఆవిష్కరించి, పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, కాంద్రేగుల సత్తిబాబు, పితాని శివరామకృష్ణ, జోగి చక్రవర్తి, అప్పారి అన్నవరం, గుబ్బల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు

- ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- సచివాలయ భవనం ప్రారంభం



బొమ్మూరులో సచివాలయం -4 నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరు టీచర్స్ కాలనీలో నిర్మించిన సచివాలయం - 4 భవనాన్ని గురువారం సాయంత్రం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు సచివాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, మండల ఇంజినీరింగ్ అధికారి సంపత్, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, యెనుముల త్యాగరాజు, ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ, సోమన శ్రీనివాస్, తోడేటి రాహుల్ పాల్గొన్నారు.

బాధితులకు తక్షణమే పరిహారం ఇవ్వాలి

- తహసీల్దార్‌కు ఎంపీ భరత్‌రామ్ ఆదేశాలు
- 7వ డివిజన్‌లో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ఏడాది కావొస్తున్నా అగ్ని ప్రమాద బాధితులకు నష్టపరిహారం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని, తక్షణమే పరిహారం అందజేయాలని తహసీల్దార్‌కు ఎంపీ భరత్ రామ్ ఆదేశాలు జారీ చేశారు. స్థానిక 7వ డివిజన్ గోరక్షణపేట సెంటర్‌లో గురువారం గుడ్‌మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ ఆ ప్రాంతంలో పర్యటించారు. 13వ సచివాలయం పరిధిలోని అగ్నిబాధిత కుటుంబం ఎంపీని కలిసి ఆవేదన వివరించింది. స్పందించిన భరత్‌రామ్ వెంటనే తహసీల్దార్‌కు ఫోన్ చేసి అగ్నిబాధిత కుటుంబానికి ప్రభుత్వం అందజేసే నష్టపరిహారం రూ.5 వేలు తక్షణమే ఇవ్వాలన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను, చిరు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తడి, పొడిచెత్తను తీసుకువెళ్లడానికి పారిశుధ్య కార్మికులు వినియోగించే డస్ట్ బిన్లు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. పుత్ర వియోగంతో బాధపడుతున్న ఏడో వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ కరీంఖాన్‌ను పరామర్శించారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఆరిఫ్, డివిజన్ ఇన్‌చార్జి ఎండీ రఫీ గౌస్, మజ్జి అప్పారావు, సయ్యద్ అల్తాఫ్, సయ్యద్ బాయ్, అహ్మద్ బాయ్, మదిని బాయి ప్రసాద్ పాల్గొన్నారు.

'దేశానికి మోదాని ముప్పు' పుస్తకావిష్కరణ

ప్రకాశం నగర్: ప్రజలకు వాస్తవాలను వివరించడానికి పుస్తక ప్రచురణలు ఎంతో ఉపయోగపడతాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ రూపొందించిన దేశానికి మోదాని ముప్పు అనే పుస్తకాన్ని గురువారం స్థానిక ప్రకాశం నగర్ రౌండ్ పార్క్ ధర్మంచర కమ్యూనిటీ హాల్లో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ఉండవల్లి అరుణ్ కుమార్ విచ్చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ దేశసంపదను అదానీకి దోచిపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, ఛాంబర్ మాజీ అధ్యక్షుడు అశోక్ కుమార్ జైన్, సీనియర్ పాత్రికేయులు కృష్ణ కుమార్, నాయకులు పి.తులసి, బి.రాజులోవ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటోనగర్ ప్రాంతానికి చెందిన బేతాళ చిట్టిబాబు (31) గురువారం సాయంత్రం మృతి చెందాడు. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం.. బేతాళ చిట్టిబాబు ఆటోనగర్‌లోని ఒక షెడ్డులో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ నెల 21వ తేదీ రాత్రి ఆటోనగర్ రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడని ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు.

జగన్ పాలనలో సంక్షేమ వెలుగులు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- బొమ్మూరులో గడపగడపకూ మన ప్రభుత్వం



బొమ్మూరు మురళీకొండపై బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: నవరత్నాలు, సంక్షేమ పథకాల అమలుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరు సచివాలయం-2 పరిధిలో గురువారం రెండోరోజు ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి శ్రీరామ్ నగర్, మురళీకొండ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారికి ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. సీఎం జగన్ పాలనలో ఇంటి వద్దకే పథకాలన్నీ వస్తున్నాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు తెలిపిన రోడ్లు, డ్రైనేజీలు తదితర సమస్యలను పరిష్కరిస్తానని చందన హామీ ఇచ్చారు. వాటికి అంచనాలు తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డికి సూచించారు. సచివాలయ కన్వీనర్లు మత్సేటి శివ, సోమన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, ఎలుగొండ లక్ష్మి, పెయ్యల రాజేష్, తోడేటి రాహుల్, కేవీ సుబ్బారెడ్డి, జాలా మోషే పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



మాట్లాడుతున్న మహాసభల చైర్మన్ డాక్టర్ ఎర్నెస్ట్ మోజెస్

సీటీఆర్ఐ: ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, సర్వమానవాళి ఒకే కుటుంబంలా మెలగాలని బైబిల్ మిషన్ రాకడ గుంపు మహాసభల చైర్మన్ డాక్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్ అన్నారు. స్థానిక వెంకటాపురం సీయోను ప్రార్థనా మహిమ మందిరం, షారోను గృహ ప్రాంగణములో జరుగుతున్న మహాసభలు గురువారంతో ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు, బిషప్ ప్రతాప్‌సిన్హా మాట్లాడుతూ ఏసు బోధనలతో మానవ జీవితాల్లో శాంతి, సమాధానాలు వస్తాయన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని క్షమాగుణం అలవాటు చేసుకోవాలన్నారు. సభల కన్వీనర్ రెవరెండ్ ఎం.వర ప్రసాద్ దైవసేవకులు, విశ్వాసులకు స్వాగతం పలికారు. సీయోను ప్రార్థనార్థ మందిరం వ్యవస్థాపకులు డాక్టర్ గారపాటి ఎలిజబెత్, రెవరెండ్ మరనాతరావు, రెవరెండ్ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కడియం: వైఎస్సార్ సీపీ నాయకుడు రంకిరెడ్డి వీరకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా జేగురుపాడు జీవీకే హైస్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను గురువారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఎంపీటీసీ ఆకుల సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేమగిరి, కడియం, కె.సావరం, జేగురుపాడు ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ కడియం మండలం దుళ్లలోని వ్యవసాయ బోర్లకు సరఫరా ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నగరంలోని కోర్లమ్మపేట, తుమ్మలోవ, సాంబశివరావు పేట ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

హ్యూందాయ్ వెర్నా కారు ఆవిష్కరణ



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక లక్ష్మీ హ్యూందాయ్ షోరూమ్‌లో గురువారం సాయంత్రం అధునాతన హ్యూందాయ్ వెర్నాకారును ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం మార్కెట్‌లోకి విడుదల చేశారు. గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ మాట్లాడుతూ సరికొత్త ఆరు ఎయిర్ బ్యాగులు, టైప్ సి చార్జింగ్, అడ్వాన్స్ క్రూయిజ్ కంట్రోల్, ఫ్రంట్ ఫుట్ వెల్ లైటింగ్, టైర్‌ప్రెష్యూర్ మానిటరింగ్ సిస్టమ్, ఎల్‌ఈడీ ల్యాంప్స్ విత్ కనెక్టెడ్ డిజైన్ వంటి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, ఆడాస్ లెవెల్ - 2 వంటి అధునాతన ఫీచర్లతో కారును రూపొందించారన్నారు. ఏడు సరికొత్త ఆకర్షణీయమైన రంగులలో లభిస్తుందన్నారు. వెర్నాకారు పెట్రోలు బేసిక్‌కారు ధర రూ.10.90 లక్షలుగా ఉందన్నారు. కార్యక్రమంలో వీరేష్, వి.కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రకాశం నగర్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని బాలాజీపేట-1, రాజేంద్రనగర్-1, ఆంధ్రానగర్, బత్తినవారి వీధి ప్రాంతాల్లో నాలుగు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి గురువారం ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 23 నుంచి 31 వరకు ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు.

రాజానగరం ప్రాజెక్టు పరిధిలో..

రాజానగరం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాల పోస్టుల భర్తీకి సీడీపీఓ టి.నాగమణి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మండలాల వారీగా రాజానగరంలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక సహాయకురాలు, రాజమహేంద్రవరం రూరల్‌లో ఒక సహాయకురాలు, కడియంలో మూడు సహాయకురాలు పోస్టులు ఖాళీలున్నాయి. ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను తీసుకుని, పూర్తి చేసి, మార్చి 31లోగా అందజేయాలన్నారు. కార్యకర్తల పోస్టులు పాలచర్ల-2లో ఒకటి (ఎస్టీ), తోకాడ-2లో ఒకటి (జనరల్), సహాయకురాల పోస్టులు దివాన్‌చెరువు-3లో ఒకటి (జనరల్), ధవళేశ్వరం-14లో ఒకటి (బీసీ-ఈ), కడియపులంక-8లో ఒకటి (జనరల్), కడియం సావరం-2లో ఒకటి (జనరల్), దుళ్ల-6లో ఒకటి (ఎస్సీ) ఖాళీలున్నాయి.

సంపద తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎగసిపడుతున్న మంటలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలకసంస్థ పరిధిలోని 16వ డివిజన్ వాంబేకాలనీ ఆవరోడ్డులో ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం బుధవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతైంది. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి గోపీకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది రాజమహేంద్రవరం రెండు, కొవ్వూరు ఒకటి అగ్నిమాపక శకటాలతో గురువారం తెల్లవారుజాము 5.30 గంటల వరకు శ్రమించి మంటలను అదుపుచేశారు. తయారీ కేంద్రంలో ఉన్న చెత్తతో పాటు మిషనరీ పూర్తిగా కాలిపోయింది. నగరపాలకసంస్థ శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారులు ప్రమాద నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అన్న విషయంపై దర్యాప్తు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బేగం గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మంటలు ఎగసిపడడంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తిపోయారు.